సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీ!



ఎన్ఏడీ సెంటర్ అడ్డాగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల దోపిడీ పర్వం కొనసాగుతోంది. ఎన్ఏడీ ఆర్టీసీ బస్టాప్‌లోనే దర్జాగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను నిలిపి ప్రయాణికులను ఎగరేసుకుపోతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతున్నా ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులు చోద్యం చూస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

-విశాఖ విద్య

- ఎన్ఏడీ సెంటర్‌లో ఏజెంట్ల తిష్ట
- నిబంధనలకు విరుద్ధంగా లగేజీ రవాణా
- బస్టాప్‌లోనే నిలుపుతున్న ట్రావెల్స్ బస్సులు
- ఆర్టీసీ ఆదాయానికి గండి
- ప్రతి రోజూ 5 వేలకు పైగా ఇక్కడ నుంచే ప్రయాణం
- చోద్యం చూస్తున్న ప్రజారవాణా అధికారులు



ఎన్ఏడీ ఆర్టీసీ బస్టాప్‌లో ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు



మూసివేసి ఉన్న పార్సిల్ కౌంటర్



ఎన్ఏడీ సెంటర్‌లోని బస్టాప్

విశాఖ నగరంలో ద్వారాక బస్టాండ్ తర్వాత ఎన్ఏడీ సెంటరే ప్రధానమైనది. ప్రతీ రోజూ 3 వేల మంది, అదే సెలవు రోజుల్లో అయితే 5 వేల మంది వరకు ప్రయాణికులు ఎన్ఏడీ బస్టాప్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. దూర ప్రాంత బస్సులకు ఇదే చోట స్టాప్ ఉండడంతో సింహాచలం ఆలయ దర్శనం కోసం వచ్చే భక్తులతో పాటు, ఎన్ఏడీ సెంటర్‌కు నలువైపులా ఉన్న మర్రిపాలెం, పెందుర్తి, విశాఖ విమానాశ్రయం, ఊర్వశి జంక్షన్ తదితర రూట్లలో వచ్చే వారంతా ఇక్కడే బస్సులు ఎక్కుతారు.

బస్టాప్‌లోనే ప్రైవేటు ట్రావెల్స్ తిష్ట

ఎన్ఏడీ బస్టాప్‌లో దూర ప్రాంత సర్వీసులతో పాటు సిటీ సర్వీసులకు స్టాప్ ఉంది. దీంతో ఈ సెంటర్ ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇలాంటి చోట ప్రైవేటు ట్రావెల్స్ నిలుపుతుండడంతో ఆర్టీసీ సిటీ సర్వీసులు ఎక్కే ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యంగా ఉంటుంది. ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రధానమైన బస్టాప్‌ల్లో ప్రైవేటు ట్రావెల్స్ నిలపకూడదు. అనుమతులు ఉన్న ట్రావెల్స్ బస్సులనైనా ఆర్టీసీ బస్టాప్‌లకు దూరంగా పెట్టి వారికి సంబంధించిన ప్రయాణికులను ఎక్కించుకోవాలి. కానీ ఎన్ఏడీ సెంటర్‌లో ఆర్టీసీ బస్టాప్‌నే అడ్డాగా చేసుకొని ప్రైవేటు ట్రావెల్స్ వారు ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. ప్రతీ రోజూ మధ్యాహ్నం 1గంట మొదలుకొని రాత్రి 11 గంటల వరకు ఇదే తంతు ఇక్కడ కనిపిస్తోంది.

చోద్యం చూస్తున్న అధికారులు

బతుకు తెరువు కోసం ఆటోలు నడుపుకునే వారిపై ప్రతాపం చూపించే రవాణ శాఖ అధికారులు ప్రైవేటు ట్రావెల్స్ విషయంలో ఎందుకు ఉదాసీనంగా ఉంటున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. రవాణా శాఖ కమిషనర్ కార్యాలయం ఎన్ఏడీ సెంటర్‌కు కూతవేటు దూరంలోనే ఉంది. కానీ ఎన్ఏడీ సెంటర్‌లో నిలిపే ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీని నియంత్రించక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ప్రైవేటు ట్రావెల్స్‌కు ఎక్కించేందుకు సిద్ధంగా ఉంచిన లగేజీ

ట్రావెల్స్‌లో భారీగా లగేజీ రవాణా

ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో ఇటీవల కాలంలో లగేజీ సైతం అధిక మోతాదులో రవాణా చేస్తున్నారు. పరిమితికి మించి లగేజీ బస్సుల్లో వేస్తుండడంతో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. లగేజీ రవాణా కోసం ఆర్టీసీ ఆధ్వర్యంలో ఎన్ఏడీ సెంటర్‌లో కౌంటర్ ఏర్పాటు చేసినా అది ఎప్పుడూ మూసే ఉంటుంది. ఎన్ఏడీ సెంటర్‌లోని రద్దీ దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ అధికారులు ఇక్కడ ఇద్దరు గైడ్లను ఏర్పాటు చేశారు. అదేవిధంగా టికెట్ రిజర్వేషన్ కౌంటర్ కూడా ఉంది. అయితే బస్టాప్‌లో ప్రైవేటు బస్సు నిలుప వద్దని ఆర్టీసీ గైడ్లు హెచ్చరిస్తున్నా వారు ఏమాత్రం పట్టించుకోవటం లేదు. ప్రధానమైన సెంటర్‌లో గైడ్లుతో అదనంగా సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులను విధుల్లో ఉంచితే కొంతమేర ఇలాంటి వాటిని నియంత్రించే అవకాశం ఉంటుంది. ఆర్టీసీ,రవాణ శాఖ అధికారులు ఇప్పటికైనా మేల్కొని ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీకి అడ్డుకట్ట వేయాలని ప్రజానీకం కోరుతున్నారు.

క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

మల్కాపురం: మల్కాపురం మరిడిమాంబ కల్యాణమండపంలో ఆదివారం జరగనున్న సర్వసభ్య సమావేశానికి షిప్‌యార్డ్ కార్మికులంతా హాజరు కావాలని హిందుస్థాన్ షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.ఎస్.ఆర్. మూర్తి కోరారు. ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్‌తో పాటు జిల్లాలోని పలు పరిశ్రమల్లో ఉన్న ఐఎన్‌టీయూసీ యూనియన్ నాయకులు హాజరు కానునట్టు వివరించారు. సర్వసభ్య సమావేశానికి సంస్థలో పని చేస్తున్న స్టాఫ్, కార్మికులంతా హాజరు కావాలని కోరారు. వనభోజనాలు ఉంటాయని తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

గోపాలపట్నం: శ్రీమాతా కన్యకా పరమేశ్వరి కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సంతోష్‌నగర్‌లోని కళింగ వైశ్య సంక్షేమ భవనంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గణబాబు ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు. కళింగ వైశ్యులంతా పాల్గొని రక్తదానం చేయాలని సంఘ సభ్యులు కోరారు.

4న ఉక్కు కేవీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని కేంద్రీయ విద్యాలయంలో ఈనెల 4న కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ వంశీకృష్ణ తెలిపారు. పీజీటీ విభాగంలో ఇంగ్లిష్, హిందీ, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కామర్స్, ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్ పోస్టులకు, టీజీటీ విభాగంలో ఇంగ్లిష్, హిందీ, సంస్కృతం, గణితం, సైన్స్, సోషల్ సైన్స్, ఇంకా పీఆర్‌టీ, కంప్యూటర్ ఇనస్ట్రక్టర్, స్పోర్ట్స్ కోచ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్, స్పెషల్ ఎడ్యుకేటర్, యోగా ఇనస్ట్రక్టర్, నర్స్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఆ రోజు ఉదయం 8.30 నుంచి దరఖాస్తుల స్వీకరణ, అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు కేవీ వెబ్‌సైట్ సందర్శించాలని ఆయన కోరారు.

మహిళా పోలీసులకు ఉచిత వైద్య సేవలు



డీసీపీ(క్రైమ్) లతా మాధురికి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

విశాఖ సిటీ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో డీసీపీ(క్రైమ్) లతామాధురి ఆధ్వర్యంలో శనివారం పోలీస్ కల్యాణ మండపంలో అపోలో ఆస్పత్రి వైద్య బృందంతో శిబిరాన్ని ఏర్పాటు చేశారు.డీసీపీ స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సుమారు 220 మంది అధికారులు, సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు.

యువకుడి ఆత్మహత్య

మర్రిపాలెం: కంచరపాలెం ఇందిరానగర్-5లో తల్లిదండ్రులతో కలిసి నివాసముంటున్న ఎం. అజయ్ సంపత్ సాయి (26) ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన శనివారం కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అజయ్ సంపత్ సాయి బీటెక్ చదువుకున్నాడు. ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. తండ్రి నారాయణమూర్తి డ్రైవర్‌గా పని చేస్తున్నారు. అలాగే తల్లి గాజువాకలో ఓ ట్రావెల్స్ సంస్థలో పని చేస్తున్నారు. ఇతనికి ఓ సోదరి కూడా ఉంది. ఆమెకు వివాహం అయి అత్తవారింట్లో ఉంటోంది. శనివారం అజయ్ తల్లిదండ్రులిద్దరూ విధులకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం సుమారు 1.30 ప్రాంతంలో తండ్రి నారాయణమూర్తి ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు వేసి ఉన్నాయి. ఎంత సేపటికీ తలుపు తీయకపోవడంతో ఇరుగు పొరుగు వారి సహాయంతో తలుపు పగులగొట్టి చూడగా అజయ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా 20 రోజుల క్రితం తన చిన్నాన్న కుమారులిద్దరూ రాంబిల్లి బీచ్‌లో స్నానానికి వెళ్లి మృత్యువాత పడ్డారు. అప్పటి నుండి అజయ్ ఒంటరిగా ఉంటూ మనస్థాపం చెంది మానసికంగా బాధపడుతూ ఉన్నాడు. ఈ క్రమంలో ఆత్మహత్య చేసుకున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారని పోలీసులు చెబుతున్నారు. అతని తల్లి లీలారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆకట్టుకున్న ఆవిష్కరణలు



నరవ కళాశాలలో విద్యార్థుల సైన్స్ ప్రదర్శనను పరిశీలిస్తున్న అధ్యాపకులు



జనతా కాలనీ స్కూల్‌లో సైన్స్ ఆవిష్కరణలను తిలకిస్తున్న ఎంఈవో త్రినాథ్‌రావు

గోపాలపట్నం: నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో శనివారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ ఆలోచింపజేసింది. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ జి.వి.ప్రదీప్ వర్మ ప్రారంభించారు. సర్ సి.వి.రామన్ చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులర్పించారు. సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించారు. ఇటువంటి ప్రదర్శనల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకతతోపాటు విజ్ఞానం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.ప్రసాద్, అకడమిక్ డీన్ పి.శాంతారావు, పి.సుబ్బరాజు, రామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం జనతా కాలనీలోని ప్రియదర్శిని ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా శనివారం సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ములగాడ మండల విద్యా శాఖాధికారి(ఎంఈవో) డి.వి. త్రినాథ్‌రావు విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ఆవిష్కరణలను తిలకించారు. ప్రదర్శనలో ప్రతిభ చూపిన వారిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.ప్రసాద్‌రావు, డైరెక్టర్ వి.ఎ.రావు, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.కె.పరశురాం తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్‌లను సుందరంగా తీర్చిదిద్దాలి

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



పనులు పరిశీలిస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: వాకింగ్ ట్రాక్‌లను సుందరంగా తీర్చిదిద్దాలని నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు గ్రీన్ బెల్ట్ వాకింగ్ ట్రాక్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం అధికారులతో కలసి పరిశీలించారు. మర్రిపాలెం వుడాలే అవుట్ ప్రాంతంలో పాస్ పోర్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న గ్రీన్ బెల్ట్ లో మోడల్ లైటింగ్, బ్యూటిఫికేషన్ పనులు , వాటర్ సప్లై వంటి అభివృద్ధి పనులపై ఆయన కాంట్రాక్టర్లతో చర్చించారు.అనంతరం నవ్యాంధ్ర స్కూల్ ఎదురుగా ఉన్న గ్రీన్ బెల్ట్ వాకింగ్ ట్రాక్‌లో జిమ్ పరికరాలు, కావాల్సిన మౌలిక సదుపాయల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలన్నారు.

అప్పన్న సన్నిధిలో ఏయూ నూతన వీసీ



ఆచార్య రాజశేఖర్‌కి అప్పన్న జ్ఞాపికను అందజేస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని శనివారం ఆంధ్రా యూనివర్సిటీ నూతన వీసీ ఆచార్య గంగవంశం పైడి రాజశేఖర్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని అలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, జ్ఞాపికను ఏఈవో ఆనంద్‌కుమార్ అందించారు. ఏయూ వీసీగా రావడం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి అనుగ్రహంగా భావిస్తానని, అందరి ఆశీస్సులతో ఏయూ అభివృద్ధికి కృషి చేస్తానని ఆచార్య రాజశేఖర్ తెలిపారు. కాగా.. వీసీగా బాధ్యతలు స్వీకరించి తొలిసారి సింహాచలం వచ్చిన ఆచార్య రాజశేఖర్‌కు అడవివరం గ్రామస్తులు, ఆయన స్నేహితులు, సన్నిహితులు ఘన స్వాగతం పలికారు. రాజశేఖర్ సొంత గ్రామం అడవివరం. అడవివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్, వై.డి.వి.ప్రసాద్, రాజనాల సత్తిబాబు, గ్రామస్తులు బుజ్జి, ఎస్.అప్పారావు తదితరులు ఆచార్య రాజశేఖర్ వెంట ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

సచివాలయం సిబ్బందికి కలెక్టర్ హెచ్చరిక



విశాలాక్షినగర్ సచివాలయం సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

ఆరిలోవ: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సచివాలయం సిబ్బందిని కలెక్టర్ ఎం.ఎన్ హరేందిర ప్రసాద్ హెచ్చరించారు. విశాలాక్షినగర్ ప్రాంతం దయాల్‌నగర్‌లోని 88, 89 నంబర్ల సచివాలయాలను ఆయన శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఇక్కడ సిబ్బంది పనితీరు, రికార్డులు పరిశీలించారు. సిబ్బంది సమయపాలన, విధుల నిర్వహణ, హాజరు పట్టీ, ప్రజలు నుంచి వచ్చిన వినతుల పట్ల స్పందన తదితర అంశాలపై ఆరా తీశారు.ప్రజలు నుంచి వచ్చిన వినతులను సకాలంలో పరిష్కరిస్తున్నారా లేదా? ఉద్దేశపూర్వకంగా ఆ వినతులను పక్కనపెడుతున్నారా? తదితర వాటి గురించి తెలుసుకున్నారు. అక్కడ సిబ్బందితో కంప్యూటర్‌లో వారి లాగిన్ తెరిపించారు. అందులో నమోదు చేసిన వినతులు, పరిష్కరించిన సమస్యలు పరిశీలించారు. సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు తెలియజేయకపోవడం, సర్వేలు నిర్వహించడం తదితర అంశాల్లో సిబ్బంది వెనుకబడి ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. సక్రమంగా పనిచేయకపోతే చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించారు. ప్రజలకు సేవలు అందించడంలో ఎందుకు వెనుకబడుతున్నారని సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్ పక్కాగా చేపట్టాలని, సర్వేలు పారదర్శకగంగా జరగాలని స్పష్టం చేశారు. ఆయన వెంట జీవీఎంసీ జోనల్ కమిషనర్(ఇన్‌చార్జి) కనకమహాలక్ష్మి ఉన్నారు.

ఆర్టీసీ బస్సుల కండిషన్ పరిశీలన



బస్సులో ప్రయాణం చేస్తున్న గాజువాక డిపో మేనేజర్ ప్రవీణ

మల్కాపురం: గాజువాక ఆర్టీసీ డిపో పరిధిలోని పలు బస్సుల కండిషన్‌ను డిపో మేనేజర్ ప్రవీణ శనివారం పరిశీలించారు. గ్యారేజ్ వద్ద మరమ్మతులు పూర్తి చేసిన బస్సుల బ్రేక్ కండిషన్,మెకానికల్ కండిషన్,ప్యాసింజర్ సీట్లు, బస్సు లైట్లు అన్ని సక్రమంగా పని చేస్తున్నాయా లేదా అని తనిఖీ చేపట్టారు. అనంతరం ఆ బస్సుల్లో గ్యారేజ్ సిబ్బందితో కలిసి రోడ్డు టెస్టు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నిత్యం వందలా మంది ప్రయాణించే బస్సు కండిషన్ తెలుసుకోవడానికి రోడ్డు టెస్టులు చేపట్టామన్నారు.

బార్లలో తనిఖీలు



బార్లలో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

గోపాలపట్నం: గోపాలపట్నం ప్రాంతంలోని పలు బార్లలో శనివారం ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. బార్లలో కల్తీకి పాల్పడుతున్నారా... మద్యం నిల్వలతో పాటు రికార్డులు పరిశీలించారు. తనిఖీల్లో ఎస్ఐలు ఎం.మోహనరావు, వీఎల్ కరుణలవ, సిబ్బంది సత్యం, అప్పారావు పాల్గొన్నారు.

రెండు షాపులపై కేసు



స్వీట్‌షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

సీతమ్మధార : నగరంలోని సీతమ్మధార, ఎంఎంటీసీ కాలనీ, టీపీటీ కాలనీ, తదితర ప్రాంతాల్లోని స్వీట్ షాపులు, హోటళ్లు, కిరాణా దుకాణాల్లో జిల్లా కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ గోవిందు, తహసీల్దార్ ఎం.రమేష్ తనిఖీలు నిర్వహించారు. రెండు దుకాణాలపై కేసులు నమోదు చేశారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా దాడులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ (సర్కిల్-2) ఎస్.గోవింద్, సహాయ కార్మిక అధికారి (సర్కిల్-10) పి.విజయకుమార్, సహాయ కార్మిక అధికారి (సర్కిల్-9) విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో దళితులకు అన్యాయం

డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్



మాట్లాడుతున్న దళిత హక్కుల పోరాట సమితి నాయకులు

సింధియా: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందని దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ మండిపడ్డారు. దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం అంబేడ్కర్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రూ.3.25 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టిందని, అందులో జనాభా ప్రాతిపదికన చూస్తే 45 వేల కోట్ల ఎస్సీలకు, 22 వేల కోట్లు ఎస్టీలకు కేటాయించాలన్నారు. దానికి విరుద్ధంగా ఎస్సీలకు రూ.10 వేల 900 కోట్లు, ఎస్టీలకు 4 వేల 307 కోట్లు కేటాయించి దగా చేశారని తెలిపారు. భూమి కేటాయింపులు, విదేశీ విద్యా పథకం, కులాంతర వివాహం ప్రోత్సాహం వంటి అంశాలపై బడ్జెట్‌లో ప్రస్తావన లేదన్నారు. వెంటనే దళితులకు బడ్జెట్‌లో న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజులు, గుడాల రాంబాబు, మధు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాల్లో రెల్లి కులస్తుల సమస్యలపై చర్చించాలి

సింధియా: ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్తులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రెల్లి కుల అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొట్నాన రవి ఆధ్వర్యంలో శనివారం పలువురు ఎమ్మెల్యేలను కలిసి వినతి పత్రాలు అందజేశారు. వర్గీకరణ న్యాయమైన పద్ధతిలో జరగాలని కోరారు. అసెంబ్లీలో రెల్లికులస్తుల సమస్యలపై చర్చించాలని కోరారు. రెల్లి ఉపకులాలకు 5 శాతం రిజర్వేషన్ కేటాయించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణయాదవ్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో పాటు పశ్చిమ ఎమ్మెల్యే గణబాబుకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రెల్లి కుల సంక్షేమ సంఘం సభ్యులు గౌతమ్‌బాబా, కస్తూరి వెంకటరావు, కోన ప్రసన్నకుమార్, బంగారి రవిశంకర్, మాడుగుల భాస్కర్, వడ్డాది ఆనంద్, కొప్పల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వల్లభాయ్ పటేల్ వంతెన పనులు



వంతెన పక్కన రైల్వే ట్రాక్ నడక మార్గంపై చేపడుతున్న మరమ్మతులు



వంతెనపై వాహనాలు వచ్చిపోయే మార్గంలో పూర్తికావస్తున్న పనులు

మల్కాపురం: డాక్‌యార్డ్ సమీపాన గల సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన మార్గం మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి. మరో రెండు నెలల్లో ఇవి పూర్తి కావచ్చని తెలుస్తోంది. డాక్‌యార్డ్ సమీపాన గల ఈ వంతెనకు సుమారు వందేళ్ల చరిత్ర ఉంది. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురితోపాటు ఇక్కడ గల షిప్‌యార్డ్, డాక్‌యార్డ్, హెచ్‌పీసీఎల్, కోరమాండల్ తదితర పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు ఈ వంతెన మార్గం ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. బ్రిడ్జి పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఐదు నెలల కిందట దీనిపై రాకపోకలు నిలిపివేసి మరమ్మతులు చేపడుతున్నారు. నగరానికి చేరుకోవాలన్న, నగర వాసులు పారిశ్రామిక ప్రాంతానికి రావాలన్న అతి సులువు మార్గం సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన. దీని పనులు పూర్తయితే వాహనాల రాకపోకలు మరింత సులభతరమవుతాయి.

మాధవుడిని తాకిన సూర్య కిరణాలు

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార ఆలయంలో కొలువైన శ్రీ లీలా మాధవస్వామిని శనివారం ఉదయం సూర్యకిరణాలు నేరుగా తాకాయి.అక్కడ దర్శనం చేసుకునేందుకు వచ్చిన భక్తులు స్వామిని సూర్యకిరణాలు తాకడం నేరుగా చూసి పులకించిపోయారు. మాఘమాసం చివరిలో ఫాల్గుణ మాసం ప్రారంభంలో ప్రతి ఏడాది సూర్యకిరణాలు స్వామిని తాకుతాయని ఆలయ అనువంశీక అర్చకుడు రవీంద్రకుమార్ తెలిపారు. మాధవ నామస్మరణతో ఆలయం మార్మోగింది. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

గైస్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం

మురళీనగర్: కెమికల్ ఇంజినీరింగు ఇన్‌స్టిట్యూట్ (గైస్) అభివృద్ధికి కెమికల్ ఇంజినీరింగ్ డిప్లమా పూర్వ విద్యార్థుల సంఘం (కెమ్‌దోసా) సంపూర్ణ సహకారం అందిస్తుందని సంఘం గౌరవాధ్యక్షుడు పీవీ రంగారావు తెలిపారు. కెమ్‌దోసా 9వ వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. కాలేజీలో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే అనేక సదుపాయాల కల్పనలో సహాయం అందించినట్లు చెప్పారు. గైస్‌లోని నాలుగు బ్రాంచ్‌ల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.1.30 లక్షల బహుమతులను అందించారు. కెమ్‌దోస అధ్యక్షుడు ఏ.వరహాలు, కోఆర్డినేటర్ బీవీ లక్ష్మణరావు పాల్గొన్నారు. **నూతన కార్యవర్గం ఎన్నిక ..** ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ సమక్షంలో 2025-2027 సంవత్సరానికి కెమ్‌దోసా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీ రెండేళ్లపాటు పదవిలో ఉంటుంది. గౌరవాధ్యక్షుడిగా పీవీ రంగారావు, అధ్యక్షుడిగా టి.బాలకృష్ణారావు, కార్యదర్శిగా వైవీ తారక్, కోశాధికారిగా ఎల్.బుల్లి రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఎ.సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడిగా ఎస్. జానీబాషా, కార్యవర్గ సభ్యులుగా బి.గోవిందరావు, ఎ.ఉదయ్ తేజ, టి.నర్సింగరావు, జె.శంకరరావు, కోఆర్డినేటర్లుగా డాక్టర్ బీవీ లక్ష్మణరావు, కేబీవీఎస్ఎస్ కుమార్ ఎన్నికయ్యారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్

9912222753, 9705933394

Office mail : sakshiadvtvsp@gmail.com